క్లుప్తంగా

వారంలోపు వర్క్‌ఆర్డర్లు పూర్తిచేయాలి

చిత్తూరు కార్పొరేషన్‌: ట్రాన్స్‌కో పరిధిలో 2019–20 సంవత్సరం వరంగా వర్క్‌ఆర్డర్లను వారం లోపు క్లోజ్‌ చేయాలని ఎస్‌ఈ కృష్ణారెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఈఈలకు ఆదేశాలు జారీ చేశారు. ఇంక వర్క్‌ఆర్డర్లు పెండింగ్‌లో ఉన్న ఏఈలు వాటిని పూర్తి చేయకపోతే చర్యలు తప్పవన్నారు. పనివిలువ మొత్తం రికవరీ అయ్యే వరకు జీతాల నుంచి రికవరీ చేస్తామని హెచ్చరించారు. ఎంతకూ మార్పు లేకపోతే సహించేది లేదన్నారు.

పేదలకు కార్పొరేట్‌ వైద్య సేవలు



పుణ్యసముద్రంలో గర్భిణులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్‌ ప్రియాంక

తవణంపల్లె: పల్లెల్లో నివసిస్తున్న పేదలకు కార్పొరేట్‌ స్థాయిలో వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వైద్యాధికారి ప్రియాంక తెలిపారు. మండలంలోని పుణ్యసముద్రంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్‌ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 55 మందికి వైద్య పరీక్షలు చేయించి మందులు, మాత్రలు అందజేశారు. గర్భిణులకు పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. పీహెచ్‌సీలో ప్రసవాలు చేయిస్తున్నామని గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆస్పత్రిలో ప్రసవం తల్లీబిడ్డకు శ్రేయస్కరం అన్నారు. బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి మాత్రలు అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

క్యాంటీన్‌ నిర్వహణకు దరఖాస్తు చేసుకోండి

చిత్తూరు కలెక్టరేట్‌ : జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఉన్న క్యాంటీన్‌ నిర్వహణకు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపల్‌ జీవనజ్యోతి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024–25 విద్యాసంవత్సరానికిగాను క్యాంటీన్‌ నిర్వహణకు దరఖాస్తులు కోరుతున్నామన్నారు. ఈ నెల 29 లోపు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 8919962288ను సంప్రదించాలని ప్రిన్సిపల్‌ ఆ ప్రకటనలో కోరారు.

క్రీడలతో మానసికోల్లాసం



అందుకున్న సర్టిఫికెట్, బహుమతులను చూపుతున్న విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్‌ : ప్రతి విద్యార్థికి క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని దేవి పాఠశాల కరస్పాండెంట్‌ ఎన్‌.ఆర్‌.ప్రసాద్‌ అన్నారు. గిరింపేటలోని ఆ పాఠశాలలో శనివారం విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ముఖ్యమన్నారు. చిన్నతనం నుంచే విద్యార్థులు క్రీడల్లో రాణించాలని చెప్పారు. అనంతరం క్రీడాపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల హెచ్‌ఎం భార్గవి, విద్యార్థులు, తల్లిదండ్రులు, టీచర్లు పాల్గొన్నారు.

రోడ్డు నియమాలు పాటించండి

పూతలపట్టు: మండలంలోని ఆటో డ్రైవర్లు రోడ్డు నియమాలను పాటించాలని సీఐ సుదర్శన ప్రసాద్‌ తెలిపారు. మండల కేంద్రంలో శనివారం ఆటో డ్రైవర్లతో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఆటో నడిపే డ్రైవర్లకు తప్పకుండా లైసెన్సు ఉండాలని, నలుగురిని మించి ఆటోలో ప్రయాణించకూడదని తెలిపారు. డ్రైవర్లకు కేటాయించిన స్టాండ్‌లోనే ఆటోలను పార్క్‌ చేయాలని, బస్టాండ్లలో ప్రయాణికులకు ఇబ్బందికరంగా పార్క్‌ చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రయాణికులకు ఎక్కించుకొని జాతీయ రహదారిపై ప్రయాణించడం నేరమని, సర్వీస్‌ రోడ్డులో మాత్రమే ప్రయాణించాలని తెలిపారు. విద్యార్థులను ఎక్కించుకున్నప్పుడు డ్రైవర్‌ సీట్లో కూర్చోబెట్టుకొని ప్రయాణించకూడదని, మద్యం తాగి వాహనం నడిపితే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐలు రమణారావు, మనోహర్‌ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బైరెడ్డిపల్లె: కమ్మనపల్లె గురుకుల పాఠశాలలో 2024–2025 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్‌ ఈఆర్‌ శోభ తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ 5వ తరగతిలో 80 సీట్లు, 6 నుంచి 8వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. విలువలతో కూడిన విద్య, ఉచిత వసతి, సంరక్షణ, పౌష్టిక ఆహారం, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే బోధన, పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. పేద విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఈనెల 31 లోపు దరఖాస్తు చేసుకోవాలని, ఏప్రిల్‌ 25వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. వివరాలకు గురుకులం సంప్రదించాలని తెలిపారు.

వైఎస్సార్‌సీపీకి భారీ మెజారిటీ అందిద్దాం



సదుం: సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి



పలమనేరు: బూత్‌ కమిటీల సమావేశంలో పాల్గొన్న నాయకులు

సదుం: రానున్న ఎన్నికల్లో పుంగనూరు నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మిథున్‌రెడ్డి మరోసారి భారీ మెజారిటీతో గెలుపొందేలా పని చేస్తామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని తిమ్మానాయనపల్లె, గొంగివారిపల్లె, అమ్మగారిపల్లె, నడిగడ్డ, చెరుకువారిపల్లె, జోగివారిపల్లె, చీకలచేను, మొరవపల్లె, ఎర్రాతివారిపల్లెలో మేము సిద్ధం, మాబూత్‌లు సిద్ధం కార్యక్రమంలో భాగంగా సమావేశాలు నిర్వహించారు. గ్రామాల్లో విభేదాలు పక్కన పెట్టి ఎన్నికల్లో పార్టీ కోసం ఐక్యంగా పని చేయాలని సూచించారు. బూత్‌ కమిటీ సభ్యులు తమ పరిధిలో 90 శాతం పోలింగ్‌ నమోదు అయ్యేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని చెప్పారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. ఎన్నికల వరకు ఎలాంటి అలసత్వం ఉండకూడదని తెలియజేశారు. ముఖ్యమంత్రి వైఎస్‌ జగనన్న అమలు చేసిన ప్రభుత్వ పథకాలపై నిత్యం ఇంటింటి ప్రచారం చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, సింగిల్‌ విండో చైర్మన్‌ తిమ్మారెడ్డి, పార్టీ మండల కన్వీనర్‌ రెడ్డెప్పరెడ్డి, జేసీఎస్‌ ఇన్‌చార్జి ప్రకాష్‌రెడ్డి, ఎస్సీ సెల్‌ అధ్యక్షుడు వెంకటస్వామి, యూత్‌ కన్వీనర్‌ వినోద్‌ కుమార్, కో–ఆప్షన్‌ సభ్యుడు ఇమ్రాన్, భాస్కర్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

బూత్‌ కమిటీలే కీలకం

పలమనేరు: ప్రభుత్వం చేసిన మేలును గుర్తుంచుకొని వచ్చే ఎన్నికల్లో మరోదఫా ఫ్యాను గుర్తుకు ఓటేసి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని బూత్‌కమిటీలకు వైఎస్సార్‌ సీపీ మండల కన్వీనర్‌ బాలాజీనాయుడు, సర్పంచుల సంఘం అధ్యక్షుడు విద్యానాథరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రంగన్న, చెంగారెడ్డి సూచించారు. మండలంలోని జరావారిపల్లి పంచాయతీలో బూత్‌కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వానికి, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ఉన్న తేడాను ప్రత్యక్ష్యంగా చూశామన్నారు. ప్రజలకు జరిగిన మేలును ప్రజలకు వివరించి మళ్లీ వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చేసుకోవాలన్నారు. సర్పంచులు జగన్‌మోహన్‌రెడ్డి, గోవిందు, నాయకులు ఈశ్వర్‌రెడ్డి, గోవిందు నాయుడు పాల్గొన్నారు.





పుంగనూరు: అమరనాథరెడ్డికి స్వాగతం పలుకుతున్న నేతలు, పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడతో..

అన్ని నియోజకవర్గాల్లో 'బైక్‌' ప్రచారం

పలమనేరు: సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలును ప్రజలకు తెలియజేస్తూ ఆయన గెలుపుకోసం తాను 175 నియోజకవర్గాల్లో బైక్‌యాత్ర చేస్తున్నట్లు కడప జిల్లా పొద్దుటూరుకు చెందిన రామిరెడ్డి అమరనాథ్‌ రెడ్డి తెలిపారు. యాత్రలో భాగంగా శనివారం ఆయన పలమనేరుకు విచ్చేశారు. స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్‌ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేగౌడను కలిసి వచ్చే ఎన్నికల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ప్రభుత్వంలో పేదలకు జరుగుతున్న మేలుపై ఆనందపడి వైజాక్‌లో తన ఉద్యోగాన్ని విడిచిపెట్టి జగనన్న చేసిన మేలును ప్రచారం చేయాలని ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టానని తెలిపారు. ప్రజలే తన స్టార్‌ క్యాంపైనర్లుగా జగనన్న పేర్కొనడంతో తాను సైతం వచ్చానని తెలిపారు. ఇందుకోసం ఓ బైక్‌కు ప్రత్యేకంగా మైక్‌ను ఏర్పాటు చేసి గ్రామాల్లో ప్రభుత్వం చేసిన సాయాలను ప్రజలకు వివరిస్తున్నానని తెలిపారు. ఇప్పటికే సిద్ధం సభలకు వెళ్లానని, ఇక ఎన్నికలు జరిగేలోపు మిగిలిన నియోజకవర్గాల యాత్రను పూర్తి చేస్తానని తెలిపారు. తన యాత్రకు భార్య మనోజ్ఞ ఎంతో సహకరించారన్నారు. ఏదేమైనా మళ్లీ జగనన్నను సీఎంగా చూడాలనే లక్ష్యంతో తన యాత్ర సాగుతోందని తెలిపారు.

కుప్పం చేరుకున్న బైక్‌ యాత్ర

కుప్పం: ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ప్రజలకు అవగాహన కల్పించేందుకు అమరనాథరెడ్డి చేపట్టిన బైక్‌ యాత్ర శనివారం కుప్పం చేరుకుంది. ఆయన మాట్లాడుతూ వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాతే కుప్పం నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమైందన్నారు.

మెజారిటీతో గెలిపించాలి

పుంగనూరు: వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డిని రెండవసారి ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలని కోరుతూ అన్ని నియోజకవర్గాలలో మోటారుసైకిల్‌ యాత్ర చేస్తున్నట్లు పొద్దుటూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు అమరనాథరెడ్డి తెలిపారు. శనివారం పుంగనూరు నియోజకవర్గంలో ఆయన పర్యటించారు. నాయకులు రాజారెడ్డి, రామమోహన్‌రెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పట్టణ పొలిమేర్లలో ఆయనకు ఘన స్వాగతం పలికారు. అమరనాథరెడ్డి మాట్లాడుతూ పుంగనూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్‌ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని, ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం జగనన్న చేస్తున్న సేవల్లో ప్రతి ఒక్కరు భాగస్వామ్యులు కావాలని కోరారు.

సూర్యప్రభపై శ్రీమన్నారాయణుడు



సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు

పుంగనూరు: పట్టణంలోని కోనేటి వద్ద వెలసియున్న శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం సూర్యప్రభ వాహనంపై విహరిస్తూ స్వామివారు భక్తులను అనుగ్రహించారు. ఉదయం ఆలయంలో టెంపుల్‌ ఇన్‌స్పెక్టర్‌ మునీంద్రబాబు ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు శ్రీనివాసచార్యులు హోమాలు, అభిషేక పూజలు నిర్వహించి సర్వాంగ సుందరంగా అలంకరించారు. గోవింద నామస్మరణలతో ఆలయం భక్తిపారవశ్యమైంది. తదుపరి శ్రీవారి ఉత్సవమూర్తిని పట్టుపీతాంబరాలు, పరిమళభరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో అలంకరించి సూర్యప్రభ వాహనంపై కొలువుదీర్చి ఊరేగించారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు.

శ్రీనివాస గోవిందా..



పుత్తూరు: అప్పలాయగుంటలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి శనివారం తిరుచ్చిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. వేకువజామున సుప్రభాత సేవతో శ్రీవారిని మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారుల సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామిని సుందరంగా అలంకరించి ఊంజల్‌ సేవ చేపట్టారు. అనంతరం తిరుచ్చి వాహనంపై గ్రామోత్సవం వైభవంగా జరిగింది.

చిరు ధాన్యాలతో రోగ నిరోధక శక్తి



ఆరోగ్యవంతమైన బిడ్డతల్లులకు బహుమతుల ప్రదానం



పులిచెర్లలో పౌష్టిక ఆహారంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లె ఐసీడీఎస్‌ సెక్టార్‌ పరిధిలోని అంగన్‌వాడీలకు పోషణ పక్షోత్సవాల్లో భాగంగా శనివారం వెల్‌బేబీ షో నిర్వహించి, ఆరోగ్యకరమైన శిశువుల తల్లులకు బహుమతులను అందించారు. సీడీపీవో ఇందిరా ప్రియదర్శిని, సూపర్‌వైజర్‌ నజ్మా మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంతో కలిగే లాభాలను వివరించారు. చిరుధాన్యాలతో కూడిన ఆహారం రోగ నిరోధక శక్తి ఇస్తుందని తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్లు, ఆశాలు, ఏపీఎం మొగిలీశ్వర్, ఏఎస్‌ఎం అంజలి, ప్రేమావతి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

పులిచెర్ల(కల్లూరు): పౌష్టిక ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ విజయలక్ష్మి తెలిపారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా శనివారం ఐసీడీఎస్‌ కార్యాలయంలో అంగన్‌ వాడీ కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు ఆకుకూరలు, విటమిన్లు అధికంగా ఉండే పదార్థాలు తీసుకోవాలన్నారు. కూరగాయలు, పండ్లు, చిరుధాన్యాల ప్రదర్శనతో అవగాహన కల్పించారు. గర్భిణి రోగనిరోధకశక్తి కలిగి ఉంటేనే పుట్టేబిడ్డ కూడా ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు.

సంప్రదాయాలను భావితరాలకు అందించాలి



సంప్రదాయ దుస్తులతో విచ్చేసిన కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు

కుప్పం రూరల్‌: దేశ సంస్కృతి, సంప్రదాయాలను కొనసాగిస్తూ భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని కుప్పం ఇంజినీరింగ్‌ కళాశాల చైర్మన్‌ బీసీ నాగరాజు అన్నారు. శనివారం కళాశాలలో సంప్రదాయ దినోత్సవాన్ని (ఎతిక్స్‌డే) ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం యువత పాశ్చాత్య పోకడలను అనుకరిస్తూ, దేశ ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలను మరుస్తోందని, ఇది ఏమాత్రం మంచి పరిణామం కాదన్నారు. వైస్‌ చైర్మెన్‌ సునీల్‌రాజ్‌ మాట్లాడుతూ పెద్దలను గౌరవించడం, గురువులను పూజించడం వంటి అలవాట్లు, పండుగలు, ఉత్సవాల వంటి సంప్రదాయాలను కుటుంబ సమేతంగా చేపట్టాలని, అప్పుడే సంప్రదాయాలను నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంప్రదాయ దుస్తులతో వచ్చిన యువతి యువకులతో కలిసి యాజమాన్యం ఫోటో సూట్‌ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో సీఈవో సాగర్‌రాజ్, ప్రిన్సిపాల్‌ సుధాకర్‌ బాబు, వైస్‌ ప్రిన్సిపాల్‌ భాస్కరన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



కార్యక్రమంలో పాల్గొన్న పీవీకేఎన్‌ ఎన్‌సీసీ కేడెట్లు

చిత్తూరు కలెక్టరేట్‌ : ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పీవీకేఎన్‌ ప్రిన్సిపల్‌ డా.జీ వనజ్యోతి అన్నారు. ఆ కళాశాల ఆవరణలో శనివారం ప్రపంచ వాతావరణ దినోత్సవం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ పట్ల యువత ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్లాస్టిక్‌ వినియోగించకూడదని తెలిపారు. ప్లాస్టిక్‌ వినియోగం వల్ల కలిగే అనర్థాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని చెప్పారు. అడవులను సంరక్షించుకోవాలని చెప్పారు. అనంతరం ఆ కళాశాల ఎన్‌సీసీ కేడెట్లు పాఠశాల ఆవరణలోని వ్యర్థ పదార్థాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో వైస్‌ ప్రిన్సిపల్‌ మీరాసాహెబ్, అధ్యాపకులు రమేష్, హరిప్రసాద్, భానుప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



పలమనేరు: వైద్య సిబ్బంది ర్యాలీ



పుంగనూరులో వైద్య సిబ్బంది మానవహారం

పలమనేరు: క్షయవ్యాధికి సోకినవారికి ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన చికిత్సలు అందుబాటులో ఉన్నాయని, క్షయ రహిత సమాజం అందరి బాధ్యతని పట్టణంలోని ఏరియా ఆస్పత్రి ఆర్‌ఎంవో శారద తెలిపారు. శనివారం ఆస్పత్రిలో జాతీయ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆస్పత్రి వద్ద నుంచి వైద్య సిబ్బంది అవగాహన ర్యాలి చేపట్టారు. ఎడతెరిపి లేని దగ్గు ఉన్నవారు ప్రభుత్వాస్పత్రుల్లో అవసరమైన పరీక్షలు చేసుకొని ఉచితంగానే చికిత్సలు తీసుకోవచ్చునని తెలిపారు. ఇదే కార్యక్రమాన్ని గంగవరం మండలం పత్తికొండ పీహెచ్‌సీలో మెడికల్‌ ఆఫీసర్‌ మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. టీబీ విభాగం సిబ్బంది విజయకుమార్, గౌతమి, ఆరోగ్య సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం క్షయవ్యాధి నిర్మూలనపై ప్రతిజ్ఞ, అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి విజయ్‌చంద్ర మాట్లాడుతూ వ్యాధి నిరోధకశక్తి తక్కువ ఉన్నవారికి, పోషకాహారలోపం, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు, వృద్ధులకు, పొగతాగే వారికి, సామాజిక బలహీనత ఉన్న వారికి క్షయవ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు. రెండు వారాలకు పైగా దగ్గు తగ్గకపోవడం, బరువు తగ్గడం, జ్వరం రావడం వంటి లక్షణాలు ఉన్నవారు ప్రభుత్వ ఆస్పత్రులను సంప్రదించాలన్నారు. హెల్త్‌ ఎడ్యుకేటర్‌ సావిత్రమ్మ, సీహెచ్‌ఓ అనూరాధ, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.



వి.కోటలో..

ముందస్తు జాగ్రత్తతో నివారించవచ్చు

వి.కోట: క్షయ వ్యాధిని ముందుగా గుర్తించి, తగు జాగ్రత్తలు తీసుకుంటే పూర్తిగా నయం చేసుకోవచ్చని సీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌ కుమార్‌ పేర్కొన్నారు. శనివారం క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా సీహెచ్‌సీలో అవగహాన కార్యక్రమాలు చేపట్టారు. వైద్యులు, సిబ్బంది పట్టణంలో ర్యాలీ చేపట్టి క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించారు. మానవహారం చేపట్టారు. వైద్యాధికారులు ప్రవీణ్‌కుమార్, కేశవనారాయణ, గ్యానేంద్ర, హరిప్రసాద్, టీబీ విభాగం సూపర్‌వైజర్‌ యువరాజు, నర్సులు పాల్గొన్నారు.

పుంగనూరు: క్షయవ్యాధిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని మెడికల్‌ ఆఫీసర్‌ రంజిత సూచించారు. శనివారం పట్టణంలోని తూర్పుమొగశాలలోని వైఎస్సార్‌ అర్బన్‌ హెల్త్‌ సెంటర్‌లో ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. పురవీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్య సిబ్బంది మానహారం నిర్వహించి క్షయ వ్యాధిని అంతం చేద్దాం..అంటు నినాదాలు చేశారు. రంజిత మాట్లాడుతూ క్షయవ్యాధి గ్రస్తులకు ప్రభుత్వం ప్రతి నెల రూ.500 ఆర్థిక సహాయం అందించడమే కాకుండ పరీక్షలు, చికిత్సలు ఉచితంగా అందిస్తోందని తెలిపారు.



గంగవరం: పత్తికొండలో ర్యాలీ



బైరెడ్డిపల్లెలో..

భయాన్ని వీడితేనే ఉన్నత స్థితి



ప్రసంగిస్తున్న పిరమిడ్‌ మాస్టర్‌ చైతన్యలక్ష్మి

తవణంపల్లె: మనిషి ఉన్నతి స్థితికి ఎదగాలంటే తమలో ఉన్న భయాన్ని, అహాన్ని విడనాడాలని నెల్లూరుకు చెందిన ఆంజనేయ పిరమిడ్‌ ధ్యాన కేంద్రం వ్యవస్థాపకులు, సీనియర్‌ పిరమిడ్‌ మాస్టర్‌ చైతన్యలక్ష్మి ధ్యానులకు సూచించారు. మండలంలోని సిద్ధంపల్లె సమీపంలోని శ్రీ విఘ్నేశ్వర పిరమిడ్‌ మహా శక్తి క్షేత్రంలో శనివారం ఆత్మజ్ఞాన సదస్సు నిర్వహించారు. అందులో చైతన్యలక్ష్మి ప్రసంగిస్తూ తమపై తమకు నమ్మకం ఉండాలన్నారు. తమను తాము ప్రేమించినప్పుడే ఇతరులను ప్రేమిస్తారని పేర్కొన్నారు. ధ్యానంపై నమ్మకం, తమపై విశ్వాసం, క్షమాగుణం, ప్రేమతత్వం, దానగుణం ఉంటే మానవుడు మాధవుడుగా ఎదుగుతారని వివరించారు. ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా చేసే సాయం ఎప్పటికీ వృథా కాదన్నారు. పిరమిడ్‌ మాస్టర్‌ను శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా పిరమిడ్‌ స్పిరిచువల్‌ సొసైటీ, గ్లోబల్‌ స్పిరిచువల్‌ ట్రస్ట్‌ వ్యవస్థాపకులు డాక్టర్‌ బి.గోపాలకృష్ణమూర్తి, ట్రస్టు కన్వీనర్‌ రాధిక, ధ్యానులు పాల్గొన్నారు.

ఘనంగా పంగుణి ఉత్సవాలు



చిత్తూరు రూరల్‌: చిత్తూరు నగరంలోని ఈశ్వరగుడివీధిలో వెలసిన శ్రీఅగస్త్యేశ్వరస్వామి ఆలయంలో శనివారం పంగుణి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం మూలస్థానంలోని స్వామి వారికి అభిషేక పూజలు చేశారు. అనంతరం స్వామివారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం వేదపండితులు శాస్త్రోక్తంగా హోమాలు జరిపించారు. ఈ పూజల్లో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి పాల్గొన్నారు. పండితులు లోకకల్యాణార్థం నిర్వహించే ఈ హోమ పూజ ఘటాన్ని ఆయనకు వివరించారు. తదనంతరం ఆయనకు స్వామి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్‌ శివకుమార్, అర్చకులు శివ పాల్గొన్నారు.